క్లుప్తంగా

ఆది దంపతులకు స్వర నీరాజనం



విజయవాడ కల్చరల్: మహాశివరాత్రి సందర్భంగా స్వరఝురి సంగీత సంస్థ ఆధ్వర్యంలో గవర్నర్‌పేటలోని సీతారామచంద్రమూర్తి దేవస్థానంలో బుధవారం నిర్వహించిన అఖండ నాదార్చన కార్యక్రమం మధురంగా సాగింది. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన సంగీత విద్వాంసులు, యువ సంగీత కళాకారులు భక్తిగా పార్వతీ పరమేశ్వరులకు సంగీత నీరాజనాలు అందించారు. వాగ్గేయకారులు పరమేశ్వరుని మీద రచించిన కీర్తనలను ఆలపించారు. కార్యక్రమంలో ప్రముఖ సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్, పంతుల రమ, వేమూరి విశ్వనాథ్, ద్వారం లక్ష్మి, మల్లాది కార్తీక త్రివేణితో పాటు పలువురు యువ సంగీత కళాకారులు పాల్గొన్నారు. పాలపర్తి నాగేశ్వరరావు, అంబటిపూడి కామాక్షి, గండూరి శ్రీనివాసమూర్తి వాద్య సహకారం అందించారు. కార్యక్రమాలను కళాపోషకుడు బొగ్గవరపు రామకృష్ణ ప్రారంభించారు.

కేరాఫ్ గంగిరెద్దుల దిబ్బ సినిమా పోస్టర్ ఆవిష్కరణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): శ్రీ లక్ష్మీ భవానీ ఫిలింస్ బ్యానర్‌పై రూపొందిన 'కేరాఫ్ గంగిరెద్దుల దిబ్బ' చిత్రం పెద్ద విజయం సాధించాలని రెడ్ బ్రిక్స్ డెవలపర్స్ అధినేత పి.ఎస్.కుమార్, మెట్రో కార్స్ అధినేత జి.మహేష్ ఆకాంక్షించారు. ఏలూరు రోడ్డులోని రెడ్ బ్రిక్స్ డెవలపర్స్ కార్యాలయంలో బుధవారం గంగిరెద్దుల దిబ్బ చిత్రం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చలనచిత్ర పరిశ్రమపై మక్కువతో ఎంతో కష్టపడి గొప్ప చిత్రాలను అందించే దర్శకుడు ఎస్ఎస్ స్వామి అని కొనియాడారు. చిత్ర దర్శకుడు ఎస్ఎస్ స్వామి మాట్లాడుతూ ' కేరాఫ్ గంగిరెద్దుల దిబ్బ' చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులు చూడదగ్గ చిత్రమన్నారు. నిర్మాణం పూర్తి చేసుకుని త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుందన్నారు. కార్యక్రమంలో నిర్మాత ఎస్.మణికంఠ, వేమూరి వెంకట్రావు, బి.జె.కుమార్, జి.రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సహనాన్ని పరీక్షిస్తున్న డంపర్ బిన్



మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే మధురానగర్ రైల్వేగేటు సమీపంలోని శివాలయం రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన డంపర్ బిన్ స్థానికుల సహనాన్ని పరీక్షిస్తుంది. ఇక్కడ పారిశుద్ధ్య సిబ్బంది డంపర్‌బిన్‌ను రోడ్డు మధ్యలో ఏర్పాటు చేశారు. దీంతో శుచిగా దేవాలయాలకు వెళ్లే భక్తులు డంపర్ బిన్ పక్క నుంచి వెళ్లటానికి నానాయాతన పడుతున్నారు. డంపర్ బిన్ నుంచి వచ్చే దుర్వాసన భరించలేకపోతున్నామని, డంపర్ బిన్‌ను రోడ్డు పక్కకు మార్చాలని స్థానికులు కోరుతున్నారు. డంపర్‌బిన్‌ను ప్రతి రోజు శుభ్రం చేయాలని, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఐఎఫ్‌టీయూ విలీన సభ పోస్టర్ ఆవిష్కరణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మార్చి 2వ తేదీన రాజమండ్రిలోని పుష్కరాల రేవు దగ్గర చందా సత్రంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) విలీన సభ నిర్వహిస్తున్నామని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్ చెప్పారు. విలీన సభ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం మొగల్రాజపురం సున్నపుబట్టీల సెంటర్‌లోని పూలే-అంబేడ్కర్ భవన్‌లో బుధవారం జరిగింది. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, ఉపాధ్యక్షులు ఎం.ఏసు, ఆర్.హరికృష్ణ, జె.వెంకటేశ్వర్లు, కార్యదర్శులు ఆర్.మోహన్, ఎం.వెంకటేశ్వర్లు, కె.రమణ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతే సమాజ శాంతికి మూలం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ప్రజల్లో భక్తి భావాలు పెరిగి ఆధ్యాత్మిక చింతనతో సాగితే పాప పుణ్యాల విచక్షణ తెలిసి సమాజంలో శాంతి సౌఖ్యాలు నెలకొంటాయని ప్రముఖ సామాజిక, ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని వాసవి క్లబ్ డైమండ్ కపుల్స్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక సత్యనారాయణపురంలోని సీతారామ కల్యాణ మండపంలో విశేష పూజలు నిర్వహించి, భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షులు వేముల హజరత్తయ్య గుప్తా కాశీవిశ్వేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

హరహర మహాదేవ శంభో శంకర!

- శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు
- ఘనంగా మహాశివరాత్రి వేడుకలు
- స్వామి వారిని దర్శించుకున్న మల్లాది విష్ణు, గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): మహాశివరాత్రి వేడుకలు బుధవారం నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. పరమశివునికి ప్రీతిపాత్రమైన మహాశివరాత్రిని పురస్కరించుకుని శివాలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. నియోజకవర్గంలో ప్రముఖ శివాలయాలైన ముత్యాలంపాడు శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయం, అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠం, మధురానగర్ ఉభయ రామలింగేశ్వరస్వామివారి దేవాలయాల్లో ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. శివనామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. క్యూలైన్లలో భక్తులు బారులు తీరి శివ దర్శనం చేసుకున్నారు. స్వామివారికి విశేషంగా మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముత్యాలంపాడులోని శ్రీపార్వతీసమేత రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. శివయ్య ఆశీస్సులు ప్రజలందరికీ అందాలని కోరుకున్నారు. ఆలయకమిటీ అధ్యక్ష, కార్యదర్శులు డీవీఎస్ రాజు, డి.శివరామరాజు, ఆలయకమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

షిర్డీ సాయిబాబా మందిరంలో...

మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని బుధవారం ముత్యాలంపాడు షిర్డీ సాయిబాబా మందిరంలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు మరకత పోలిక శ్రీ భవానీశంకర స్వామివారికి మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డితో కలిసి స్వయంగా అభిషేకాలు చేశారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య శివలింగానికి రుద్రాభిషేకం నిర్వహించారు. బాబా మందిరంలో నిర్వహించిన సర్వదేవతా హోమాలు, పూర్ణాహుతిలలో పాల్గొని పూజలు చేశారు. తొలుత షిర్డీసాయినాథుని దర్శించుకున్నారు. ముక్కంటి కరుణా కటాక్షాలు నియోజకవర్గ ప్రజలపైన, తమ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపైన ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. తదనంతరం వేదపండితులు ఆశీర్వచనాలు పలికి పరమశివుని తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టాభిరామ్, చల్లా సుధాకర్, వెన్నం రత్నారావు మందిర కోశాధికారి మందలపర్తి సత్య శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



బాబా మందిరంలో శ్రీ భవానీశంకర స్వామివారికి అభిషేకం చేస్తున్న మల్లాది విష్ణు, డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి



భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

మధురానగర్‌లో...

మధురానగర్ ఉభయ రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో స్వామివారికి ఆలయ అర్చకులు నాగవల్లి దళాలతో విశేషంగా అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం దాత సహకారంతో సుమారు 10వేల మందికి అన్నప్రసాద వితరణ జరిగింది.

శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో...

శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో స్వామివారికి శ్రీధర్మపరిషత్ మహా సంస్థానమ్ ఆధ్వర్యాన వేదపండితులు మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.



ఆలయంలో నాగవల్లీ దళాలతో స్వామివారు

భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి పూజలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, వాంబేకాలనీ పరిసర ప్రాంతాల్లో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు తెల్లవారుజామునుంచే శివాలయాలకు విచ్చేసి భక్తిశ్రద్ధలతో స్వామి వారికి పూజలు చేశారు. వాసవి క్లబ్ అజిత్ సింగ్ నగర్ ఆధ్వర్యంలో సింగ్‌నగర్‌లోని శివాలయంలో వెయ్యి మంది భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. క్లబ్ నాయకులు గుర్రం వేణుగోపాల్, ప్రెసిడెంట్ కేవీ భాస్కరరావు, సెక్రటరీ సీహెచ్ శ్రీనివాసరావు, ట్రెజరర్ యక్కల మల్లి, వ్యవస్థాపక అధ్యక్షులు కేవీసుబ్బారావు, కేవీ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

అర్ధనారీశ్వరి రూపంలో కాళీమాత అమ్మవారు

కృష్ణలంక(విజయవాడతూర్పు): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో కాళీమాత అమ్మవారు బుధవారం అర్ధనారీశ్వరి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. వేదపండితులు నారాయణశాస్త్రి ఆధ్వర్యంలో లక్ష్మీగణపతిహోమం, ఆంజనేయ స్వామి హోమం, మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతీ హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు గొల్లపూడి పుల్లయ్య, కె.జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారుడు సీహెచ్ విజయకిరణ్, కమిటీ సభ్యులు జి.సత్యం, మల్లేశ్వరరావు, రాజా తదితరులు పాల్గొన్నారు.



అర్ధనారీశ్వరిగా కాళీమాత అమ్మవారు

మహా శివలింగానికి పూలాభిషేకం



లెనిన్ సెంటర్‌లో మహా శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు



అన్నపూర్ణ దేవస్థానంలో పూజలు చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. తెల్లవారు జామునుంచే భక్తులు ఆలయాలకు క్యూ కట్టారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. లెనిన్ సెంటర్ లోని ఓం శ్రీషిర్డి నాగసాయిబాబా, నాగమానసాదేవి మందిరం పైభాగంలోని మహాశివలింగానికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు రకాల పూలతో అభిషేకం చేశారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు మహా శివలింగానికి ప్రదక్షిణలు చేశారు. ఆకులు, పండ్లు, పువ్వులు సమర్పించారు. విభూది అభిషేకాలు నిర్వహించారు. శివలింగం వద్ద దీపాలు వెలిగించారు. అనంతరం ఆలయంలోని సాయిబాబా విగ్రహానికి లక్ష పూలతో, ఆవుపాలతో అభిషేకాలు జరిగాయి. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.

శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో రుద్ర హోమం

గవర్నర్‌పేట చల్లపల్లి బంగ్లా సమీపంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం తెల్లవారు జామునుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిట లాడింది. మహాశివరాత్రి సందర్భంగా ఆలయ ఆవరణలో అఘోర సంపుటిత మహా పాశుపత రుద్ర హోమం నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమం జరిగింది. మహాశివరాత్రిని పురస్కరించుకుని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మహేశ్వరరావు కుంచెం, జస్టిస్ సుమతి జగడం కుటుంబ సమేతంగా దేవస్థానానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం అందించారు. సెంట్రల్ మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ వై.సీతారామయ్య పర్యవేక్షణలో మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించారు.

శ్యామలాంబదేవి దేవాలయంలో దీపోత్సవం



శ్యామలాంబదేవి అమ్మవారి దేవాలయంలో దీపాలతో శివలింగం



పసుపుతోటలో పారాయణం చేస్తున్న భక్తులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్య కాలనీ శ్రీ శ్యామలాంబదేవి అమ్మవారి దేవాలయంలో బుధవారం మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని దీపోత్సవం జరిగింది. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు, హోమం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని శివలింగం, ఓం, స్వస్తిక్ ఆకారంలో దీపాలు వెలిగించారు.

బాబా మందిరంలో పారాయణం

పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని మందిరంలోని శివయ్యకు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. శ్రీసాయినక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన పారాయణం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని స్వయంగా శివయ్యకు అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపకుడు తంగెళ్ళమూడి వీరమోహనరావు పర్యవేక్షించారు.

వైద్య పరికరాల నిర్వహణపై నర్సింగ్ సిబ్బందికి శిక్షణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వాస్పత్రిలో అత్యవసర పరిస్థితుల్లో వాడే వైద్య పరికరాలను రోగులకు వినియోగించడంపై నర్సింగ్ సిబ్బందికి అవగాహన కలిగించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సెరిక్స్ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా టీచింగ్ ఆస్పత్రుల్లో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో కూడా నర్సింగ్ సిబ్బందికి పలు అత్యవసర పరికరాలు నిర్వాహణ పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సెరిక్స్ సంస్థ డివిజన్ మేనేజర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ వైద్య పరికరాలను వినియోగించే పద్ధతులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలు రకాల పరికరాలను వినియోగించే తీరును వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి ఎస్‌కే మోహమ్మద్, జీజీహెచ్ బయోమెడికల్ ఇంజినీర్ జనార్దనరావు, సాంబాద్, అమర్, హెడ్‌నర్సు జాన్సన్‌రాణి తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరికరాల వినియోగంపై అవగాహన కలిగిస్తున్న నిపుణులు

డ్రైనేజీ కాల్వలు లేక ఇళ్ల మధ్యే మురుగు

- రోగాల బారిన ప్రజలు
- పట్టించుకోని అధికారులు

పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ నగరానికి శివారు ప్రాంతాలైన కండ్రిక, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో డ్రైనేజీ కాల్వలు లేక మురుగు ఇళ్ల మధ్య నిలిచి ఉంటోంది. పల్లపు ప్రాంతం కావడంతో వాడుకనీరు ఇళ్లమధ్య నిలబడి పోయి మురుగు బైటకు వెళ్లే మార్గం లేక దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తత్ఫలితంగా ఆ పరిసర ప్రాంత ప్రజలు రోగాలపాలవుతున్నారు. కండ్రిక నుంచి రాజీవ్‌నగర్ వెళ్లే రోడ్డు లో డ్రైనేజీ కాల్వల సదుపాయం లేదు. దీంతో మురుగునీరు ఖాళీగా వున్న స్థలాల్లోకి చేరుకుని అక్కడే నిల్వ ఉంటున్నాయి. ఆ మురుగునీటి నుంచి దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు చెబుతున్నారు. మురుగునీరు నిల్వ ఉండటంతో వాతావరణ కాలుష్యం అయ్యే ప్రమాదం ఉంది. గత సెప్టెంబరులో బుడమేరు వరదలు వచ్చిన సందర్భంలో రోజుల తరబడి బుడమేరు వరదనీరు నిలబడి ప్రజలు అనేక వ్యాధుల బారిన పడ్డారు. ఆ సమయంలో అక్కడ పర్యటించిన మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలని విజయవాడ నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. భవిష్యత్‌లో ఈ ప్రాంతంలో మురుగునీరు నిల్వ ఉండకూడదని, ఉడా కాలనీ నుంచి రాజీవ్‌నగర్, కండ్రిక మీదుగా డ్రైనేజీ పంపింగ్ హౌస్‌కు కనెక్ట్ అయ్యే విధంగా డ్రైనేజీ కాల్వలు నిర్మించాలని చెప్పారు. ఆరు నెలలు గడుస్తున్నా ఇంత వరకు కొత్తగా డ్రైనేజీ కాల్వల నిర్మాణం పనులు మాత్రం ప్రారంభం కాలేదని ప్రజలు అంటున్నారు. అప్పట్లో బుడమేరు వరద నీరు నిలబడకుండా కింది ప్రాంతాలకు వెళ్లేందుకు తాత్కాలిక చర్యలు చేపట్టారే తప్ప, శాశ్వత నివారణ చర్యలు చేపట్టలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉడా కాలనీలో కూడా అంతర్గత రోడ్లు, డ్రైన్లు లేకపోవడంతో మురుగునీరు నిలబడి దోమల ఉధృతి అధికంగా వుందని ఆ ప్రాంత ప్రజలు అంటున్నారు. డ్రైనేజీ కాల్వలు నిర్మించి డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలని ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



కండ్రిక-రాజీవ్‌నగర్ రోడ్డులో ఇళ్ల మధ్య మురుగు

డ్రైనేజీ కాల్వలు నిర్మించాలి



రాజీవ్‌నగర్ నుంచి కండ్రిక వెళ్లే రోడ్డుకు ఎడమ వైపున డ్రైనేజీ కాల్వ నిర్మించాలి.అంతర్గత డ్రైన్ల నుంచి వెళ్లే మురుగునీరు ఆ కాల్వకు అనుసంధానం చేయాలి.

-జి.వెంకటరెడ్డి, రాజీవ్‌నగర్

మెయిన్‌రోడ్డు ఎత్తు పెంచి, డ్రైన్ నిర్మించాలి



రాజీవ్‌నగర్- కండ్రిక రోడ్డు ఎత్తు పెంచి డ్రైన్ నిర్మించాలి. డ్రైనేజీ కాల్వ లేకపోవడంతో ఆ రోడ్డులో అక్కడక్కడ మురుగునీరు అధికమై రోడ్డు పైకి వస్తున్నాయి.

- సి.హెచ్.నగేష్, కండ్రిక

వైద్య శిబిరాలు తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ

లబ్బీపేట(విజయవాడతూర్పు): మహాశివరాత్రిని పురస్కరించుకుని జిల్లాలోని పలు ఘాట్‌లలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని తనిఖీ చేశారు. అందులో భాగంగా నగరంలోని పున్నమి ఘాట్, భవానీ ఘాట్, ఇబ్రహీంపట్నం ఫెర్రీలో ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స శిబిరాలను సందర్శించి అక్కడ సిబ్బంది భక్తులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. పుణ్యస్నానాలకు వచ్చిన భక్తులకు ఎలాంటి వైద్య అవసరం ఏర్పడినా సత్వరం స్పందించి సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సంబంధిత వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సాహిత్యం సమకాలీనమై ఉండాలి



విజయవాడ కల్చరల్: సాహిత్యం సమకాలీనమై ఉండాలని సీనియర్ జర్నలిస్ట్ వడ్లమూడి పద్మ అన్నారు. సమన్విత సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో గవర్నర్‌పేటలోని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో బుధవారం సాహితీ సమాలోచన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాహితీ జీవితంలో ఎదుర్కొన్న వెతలు, వివక్ష , వాటిని ఎదుర్కోవటానికి ఏం చేయాలనే విషయాలపై రచయిత్రులు వాడ్రేవు వీరలక్ష్మీదేవి, ముంజులూరి కృష్ణకుమారి, శాంతిశ్రీ , బాలాంత్రపు ప్రసూన, కె.ఉషారాణి, కావూరి సత్యవతి, కోపూరి పుష్పాదేవి తమ అభిప్రాయాలను అందజేశారు. సాహితీమిత్రులు గోళ్ళ నారాయణరావు, చలపాక ప్రకాష్, అనిల్ డ్యానీ, అరసవల్లి కృష్ణ రచయిత్రుల కృషిని అభినందించారు.

దుర్గా ఘాట్‌కు పోటెత్తిన భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పవిత్ర కృష్ణానదిలో భక్తులు పెద్ద ఎత్తున పుణ్యస్నానాలు ఆచరించారు. బుధవారం తెల్లవారుజాము రెండు గంటల నుంచే భక్తులు, యాత్రికులు స్నానఘాట్లకు తరలివచ్చారు. దుర్గాఘాట్‌తో పాటు భవానీ, పున్నమి ఘాట్లలో సైతం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. దుర్గాఘాట్‌లో భక్తుల రద్దీ క్రమం క్రమంగా పెరుగుతూ ఉండటంతో వారికి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా దుర్గగుడి దేవస్థాన అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. స్నానఘాట్‌లో పుణ్యస్నానాలు ఆచరించిన మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేకంగా షామియానాలను ఏర్పాటు చేశారు. స్నానఘాట్ బయట కంపార్టుమెంట్ విధానాన్ని పోలీసులు అమలు చేశారు. స్నానఘాట్‌లో పుణ్యస్నానాలు ఆచరించి బయటకు వచ్చిన తర్వాతే క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులను నదీ తీరంలోకి అనుమతించారు. దుర్గాఘాట్‌లో నదీ స్నానంతో పాటు జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేయడంతో భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా స్నానాలు ఆచరించారు. మరో వైపున కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద భక్తులు తమ పితృదేవతలకు పిండప్రదానం చేసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 గంటల వరకు పుణ్యస్నానాలు కొనసాగుతూనే ఉన్నాయి.

లారీ ఢీకొని మహిళకు గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ద్విచక్రవాహనంపై వెళుతున్న మహిళను ఢీ కొట్టడంతో గాయపడిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామవరప్పాడుకు చెందిన పి.సందీప్ భార్య బి.తేజస్విని విద్యుత్‌సౌధలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 25వ తేదీ ఉదయం విధులకు స్కూటీపై వెళుతున్న తేజస్విని రామవరప్పాడు ఫ్లై ఓవర్ వద్ద దిగుతుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన తేజస్వినిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హాస్పిటల్ నుంచి వచ్చిన సమాచారం మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడి అదృశ్యంపై ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్నేహితులతో కలిసి బయటకు వెళ్లిన తన కుమారుడు తిరిగి ఇంటికి రాలేదంటూ బుధవారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో బాలుడి తల్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధురానగర్ పసుపుతోటకు చెందిన కె.సుధకు ముగ్గురు అమ్మాయిలు, ఒక అబ్బాయి సంతానం. కుమారుడు రంగారావు (నాని) (15) ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఈనెల 24వ తేదీ మధ్యాహ్నం స్నేహితులు రోహిత్, తరుణ్‌తో కలిసి మధురానగర్ రైల్వేస్టేషన్ వద్దకు వెళ్లాడు. రైల్వేస్టేషన్ వద్ద స్నేహితులను విడిచి పెట్టి రంగారావు ఒక్కడే వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవటంతో చుట్టు పక్కల తెలిసిన వారి వద్ద విచారించినప్పటికీ ఫలితం లేకపోవటంతో బుధవారం బాలుడి తల్లి గుణదల పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.